


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర **రాజముద్ర**
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 06.07.2026 | సంపుటి: 3 | సంచిక: 154 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 06.07.2026 | V0LUME : 3 | ISSUE : 154 | PAGES: 8 | COST: 2/- |

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం




దేశంలోనే తొలిసారిగా ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం.

4




## ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

సింధుజలాలపై పాక్ ప్రేలాపనలపై భారత్ మండిపాటు

4

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు



- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు

4



# కాళేశ్వరం కేసీఆర్‌కు అప్పగించండి

## వారం రోజుల్లో తెలంగాణకు నీళ్లు ఇస్తాం

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- కేసీఆర్‌పై కక్షతో రైతులను గోస పెడుతున్నారని విమర్శ
- ప్రభుత్వం స్పందించకపోతే 50 వేల మందితో కన్నెపల్లి ముట్టడిస్తామని హెచ్చరిక

కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతోనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర గోసపెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నిరసన సందర్భంగా రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ సవాలు విసిరారు. 'కేసీఆర్‌కు కేవలం ఒక్క వారం రోజులు కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యతలను అప్పగించండి.. తెలంగాణ అంతటికీ సాగునీళ్లు పారించి చూపిస్తాం' అని స్పష్టం చేశారు. కన్నెపల్లి దగ్గర ప్రస్తుతం లక్షలాది క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రం పాలుపోతున్నాయని, కేవలం మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లోనే ఎండిపోతున్న అన్ని రిజర్వాయర్లను నింపవచ్చని కేటీఆర్ తెలిపారు. కన్నెపల్లి గేట్లు ఎత్తితే నీళ్లు వస్తాయనే నిజం కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుసని, కానీ వారు కావాలనే మోటార్లు ఆన్ చేయడం లేదని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ నాశనమైనా సరే, కేసీఆర్ ప్రభుత్వంపై బురద జల్లడమే రేవంత్ రెడ్డి ఏకైక ఎజెండా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కేసీఆర్ తెలంగాణకు ఇచ్చిన వరం అయితే, రేవంత్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన శనేశ్వరం అని ధ్వజమెత్తారు.

వివరాలు 2లో..



# ఎస్బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించండి

## కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

- హైదరాబాద్ మెట్రో స్వాధీనం, ఫేజ్-2 విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి
- నిర్వహణలో అనిశ్చితి, వ్యయం పెరుగుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన

2

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 స్వాధీనం (టేకోవర్), ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్‌కు ఆదివారం ఆయన ఒక అధికారిక లేఖ రాశారు. మెట్రో ఫేజ్-1 స్వాధీనానికి వీలుగా దాని వాస్తవ విలువను లెక్కించేందుకు, అలాగే ఫేజ్-2 ఆర్థిక నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు 'ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్'కు తక్షణమే బాధ్యతలు అప్పగించాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం వద్ద బీఆర్ఎస్ నిరసన

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కేటీఆర్

భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

2



## నల్గొండలో రోడ్డు ప్రమాదం

- బాలుడితో సహా నలుగురు దుర్మరణం
- జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

3



## దొంగ పెన్షన్లకు చెక్

- లక్ష మంది అనర్హుల తొలగింపు
- లైఫ్ అథెంటికేషన్‌తో భారీ అక్రమాలు బట్టబయలు
- అర్హులకు కొత్త అవకాశం
- మరో 3 లక్షల మందికి సామాజిక భద్రత లక్ష్యం

3



వృద్ధురాలిని బావిలోకి తోసేసిన

## డిగ్రీ విద్యార్థి అరెస్ట్

- రుణాల ఒత్తిడితో దొంగతనానికి పథకం
- నగలు దోచుకుని హత్యాయత్నం చేసిన యువకుడు
- సీసీటీవీ, ర్యాపిడో వివరాలతో నిందితుడి అరెస్ట్

2




# హైదరాబాద్‌లో లక్ష ఇళ్లే లక్ష్యం

- 361 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, తాళాలు పంపిణీ
- ఉపాధి ఉన్న ప్రాంతాల్లోనే గృహాల నిర్మాణం
- పొన్నం ప్రభాకర్
- పాత ప్రభుత్వ గృహాలపై సమగ్ర సర్వేకు ఆదేశాలు

2



## భలే మాట!





# ఎస్బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించండి

## కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

### మెట్రో స్వాధీనం, ఫేజ్-2 విస్తరణ వేగవంతం చేయాలని విజ్ఞప్తి

**హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 స్వాధీనం (టేకోవర్), ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్‌కు ఆదివారం ఆయన ఒక అధికారిక లేఖ రాశారు. మెట్రో ఫేజ్-1 స్వాధీనానికి వీలుగా దాని వాస్తవ విలువను లెక్కించేందుకు, అలాగే ఫేజ్-2 ఆర్థిక నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు 'ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్'కు తక్షణమే బాధ్యతలు అప్పగించాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియ సుదీర్ఘంగా సాగడం వల్ల ప్రాజెక్టు నిర్వహణలో రోజువారీ సవాళ్లు, అనిశ్చితి నెలకొంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "మెట్రో స్వాధీన ప్రక్రియలో జరుగుతున్న జాప్యం ఫేజ్-2 డీపీఆర్‌ల (ఞూ=) ఆమోదం, నిధుల సమీకరణ ఏర్పాట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనివల్ల ప్రాజెక్టు అమలు ఆలస్యమై, కాలాతీతం కావడం వల్ల ఫేజ్-2 నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదం ఉంది" అని లేఖలో పేర్కొన్నారు.

### జూన్ 24 సమావేశ నిర్ణయాలను అమలు చేయాలి..

గత జూన్ 24న ఢిల్లీలో కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, జి. కిషన్ రెడ్డిల సమక్షంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌తో జరిగిన ఉన్నత స్థాయి చర్చలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ సమావేశంలో.. మెట్రో ఫేజ్-1 స్వాధీనం, దాని అధిక వడ్డీ రుణాల రిఫైనాన్సింగ్‌తో పాటు ఫేజ్-2 విస్తరణకు నిధుల సమీకరణపై సమగ్ర అధ్యయనం చేసే బాధ్యతను ఎస్బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని ఉమ్మడిగా అంగీకారం కుదిరిందని తెలిపారు. అయితే, ఆ సమావేశం జరిగి చాలా కాలం గడిచినప్పటికీ ఎస్బీఐ క్యాప్స్‌కు ఇప్పటికీ అధికారికంగా బాధ్యతలు అప్పగించలేదని, దీనికి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను సమన్వయం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇప్పటికే పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని 'నోడల్ అధికారి'గా నియమించినట్లు గుర్తు చేశారు. ఢిల్లీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేసి, ఫేజ్-1 స్వాధీన ప్రక్రియను పూర్తి చేసి, ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం చేయాలని కోరారు. కాగా, ఇదే అంశంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా లేఖ రాస్తూ.. సంబంధిత మంత్రిత్వ శాఖలతో మాట్లాడి ఈ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# వృద్ధురాలిని బావిలోకి తోసేసిన డిగ్రీ విద్యార్థి అరెస్ట్

## రుణాల ఒత్తిడితో దొంగతనానికి పథకం

## నగలు దోచుకుని హత్యాయత్నం చేసిన యువకుడు

## సీసీటీవీ, ర్యాపిడో వివరాలతో నిందితుడి అరెస్ట్

**జగిత్యాల, జులై 5:** ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసైన ఓ డిగ్రీ విద్యార్థి డబ్బు కోసం దారుణానికి ఒడిగట్టాడు. పని ఇప్పిస్తానని నమ్మించి ఓ వృద్ధురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి నగలు దోచుకుని అనంతరం బావిలోకి తోసేసిన ఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా గుల్లపేట గ్రామానికి చెందిన దమ్మ దినేష్ రెడ్డి (21) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసైన అతడు దాదాపు రూ.4 లక్షలు నష్టపోయాడు. దీంతో లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోగా, వాటిని వెంటనే చెల్లించాలని నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో డబ్బు కోసం దొంగతనానికి పథకం రచించాడు. ఈ నెల 1న కూలి పనుల కోసం లేబర్ అడ్డా వద్ద నిలబడి ఉన్న గంగాధర లక్ష్మి అనే వృద్ధురాలి వద్దకు వెళ్లిన దినేష్ రెడ్డి, పని ఇప్పిస్తానని నమ్మించి నసుల్లాపూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె వద్ద ఉన్న అర తులం బంగారం, సుమారు 20 గ్రాముల వెండి ఆభరణాలను బలవంతంగా లాక్కొని, అనంతరం ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వృద్ధురాలిని బావిలోకి తోసి అక్కడి నుంచి పరారయ్యాడు. బావిలో పడిపోయిన వృద్ధురాలు తీవ్ర గాయాలతో సుమారు 21 గంటలపాటు ప్రాణాలతో పోరాడింది. మరుసటి రోజు ఉదయం స్థానిక గ్రామస్తులు ఆమె అరుపులు విని బావి వద్దకు చేరుకుని బయటకు తీశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు సమాచారం. ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. నిందితుడు ఉపయోగించిన ర్యాపిడో బుకింగ్‌కు సంబంధించిన ఫోన్ నంబర్‌ను గుర్తించి సాంకేతిక ఆధారాలతో కరీంనగర్ అమరవీరుల స్తూపం సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితుడు దోచుకున్న బంగారాన్ని టవర్ సర్కిల్ వద్ద వేణు మనోహరాచారి అనే బంగారం వ్యాపారికి విక్రయించి రూ.30 వేల నగదు తీసుకున్నట్లు వెల్లడించాడు. నిందితుడితో పాటు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ వ్యసనం యువతను నేరాల బాట పట్టిస్తున్నాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోందని పోలీసులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత అక్రమ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# కాళేశ్వరం కేసీఆర్‌కు అప్పగించండి

- వారం రోజుల్లో తెలంగాణకు నీళ్లు ఇస్తాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- కేసీఆర్‌పై కక్షతో రైతులను గోసపెడుతున్నారని విమర్శ
- ప్రభుత్వం స్పందించకపోతే 50 వేల మందితో కన్నెపల్లి ముట్టడిస్తామని హెచ్చరిక

**జయశంకర్ భూపాలపల్లి, జూలై 6:** కాళేశ్వరం ప్రాజెక్టును మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఒక్క వారం రోజుల పాటు అప్పగిస్తే తెలంగాణ అంతటా నీళ్లు పారించి చూపిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కన్నెపల్లి గేట్లు ఎత్తి పంపులు ప్రారంభిస్తే వారం రోజుల్లోనే రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ నింపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం లక్ష క్యూసెక్కులకుపైగా నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నీళ్లు ఇస్తే యూరియా ఇవ్వాలి, పంటలు పండితే విద్యుత్, మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలకే



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. కాళేశ్వరం తెలంగాణకు కేసీఆర్ ఇచ్చిన వరమని, కానీ రేవంత్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన "శనేశ్వరం"గా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఎస్ఏ నివేదికను, ఎన్డీఏ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల క్రితమే ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై హెచ్చరించామని, ప్రస్తుతం 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఉమ్మడి ఏడు జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు కూడా తాగునీరు అందించవచ్చని, అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంపులను ప్రారంభించకపోతే 50 వేల మంది రైతులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి పంపులను తామే ప్రారంభిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం రూ.5 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసిందని కేటీఆర్ తెలిపారు. విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి రూ.లక్ష కోట్లు, 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.50 వేల కోట్లు, కాళేశ్వరం సహా సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.1.80 లక్షల కోట్లు, రైతుబంధుకు రూ.72 వేల కోట్లు, రైతు బీమాకు రూ.30 వేల కోట్లు వెచ్చించామని గుర్తు చేశారు. ఎల్ అండ్ టీ సంస్థ మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు ముందుకొచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించిన కేటీఆర్, కేసీఆర్‌పై కక్షతో రైతులకు శిక్ష విధిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించాలని డిమాండ్ చేశారు.

# కాళేశ్వరం వద్ద బీఆర్ఎస్ నిరసన

## కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కేటీఆర్

## ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు

## భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

**జయశంకర్ భూపాలపల్లి, జూలై 6:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తన నిరసన కార్యక్రమాలను ఉధృతం చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) నేతృత్వంలోని బృందం ఆదివారం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది. పోలీసులు ఏర్పాటు చేసిన కంచెలను దాటి పంప్‌హౌస్‌కు చేరుకున్న కేటీఆర్, అక్కడి పరిస్థితులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రైతాంగానికి జీవనాడిగా కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని, అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సాంకేతిక సమస్యలను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల రైతులకు సాగునీరు అందించే అవకాశాలు దెబ్బతింటున్నాయని అన్నారు. వృథాగా పోతున్న నీటి వద్దనే నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా



విఫలమైందని, రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ ప్రాజెక్టును సంరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, దానిని విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పంప్‌హౌస్ పరిసరాల్లో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తుకు కీలకమని, దాని పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం

## 361 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, తాళాలు పంపిణీ

## ఉపాధి ఉన్న ప్రాంతాల్లోనే గృహాల నిర్మాణం: పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 5:** రాష్ట్రంలోని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన శాశ్వత గృహాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, మాజిద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తదితరులతో కలిసి 361 మంది లబ్ధిదారులకు రెండు పడకగదుల ఇళ్ల పట్టాలు, తాళాలను మంత్రులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూసిన పేద కుటుంబాల నిరీక్షణకు ముగింపు పలకడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇకపై అర్హులైన వారికి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం చేశారు. సొంతింటి కోసం ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఇళ్లను అందించడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో పనిచేసే నిరుపేదలు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారు పనిచేస్తున్న ప్రాంతాల్లోనే గృహాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అవసరమైతే విలువైన ప్రభుత్వ భూములను కూడా ఇందుకు వినియోగిస్తామని చెప్పారు. నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధికారులు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారని వెల్లడించారు. ప్రభుత్వం గృహాలకే పరిమితం కాకుండా సమగ్ర సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు



అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. హైదరాబాద్‌లోని వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర పథకాల కింద నిర్మించిన పాత ప్రభుత్వ గృహాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నివాసయోగ్యం కాని భవనాలను ఖాళీ చేయించి, మరమ్మతులు చేయదగిన వాటిని పునరుద్ధరించాలని, పూర్తిగా శిథిలమైన భవనాలను తొలగించి కొత్త గృహాల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత గృహం కల్పించడం సామాజిక న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ మొత్తం 361 గృహాలను కేటాయించినట్లు



తెలిపారు. వీటిలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన 187 మంది, నాంపల్లి నియోజకవర్గానికి చెందిన 79 మంది, నాచారం కాలనీ ప్రాంతానికి చెందిన 95 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, మాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందిరమ్మ గృహాల ద్వారా వేలాది కుటుంబాల సొంతింటి కల నెరవేరబోతోందని అన్నారు. రాష్ట్రంలో సామాజిక భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం గృహ నిర్మాణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.

# దొంగ పెన్షన్లకు చెక్

## లక్ష మంది అనర్హుల తొలగింపు

- లైఫ్ అథెంటికేషన్‌తో భారీ అక్రమాలు బట్టబయలు
- ప్రజాధనానికి రక్షణ.. అర్హులకు కొత్త అవకాశం
- మరో 3 లక్షల మందికి సామాజిక భద్రత లక్ష్యం



**హైదరాబాద్, జులై 5 :** తెలంగాణలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ వ్యవస్థలో భారీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అర్హులైన నిరుపేదలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించి, నిజమైన అర్హులకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రత్యేక తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, కొన్నేళ్ల క్రితమే మరణించిన లబ్ధిదారుల పేర్లు కూడా జాబితాల్లో కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మరణించిన వారి పేర్లను తొలగించకుండా కొందరు అక్రమంగా ప్రతి నెలా పెన్షన్ నగదును పొందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో బయటపడింది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

ఈ అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు తప్పనిసరిగా 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియ అమలు చేయడంతో జీవించి ఉన్న లబ్ధిదారులు, మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా గుర్తించే అవకాశం లభించింది. ఈ డిజిటల్ ధ్రువీకరణతో దొంగ పెన్షన్ల వ్యవహారం బయటపడగా, వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను శాశ్వతంగా జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ చర్యతో ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా నుంచి వృథాగా వెళ్తున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుందని అధికారులు భావిస్తున్నారు. సామాజిక భద్రతా పథకాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటున్నారు. అనర్హుల తొలగింపుతో మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకు మళ్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు లక్షల మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుండగా, తాజాగా తొలగించిన అనర్హుల స్థానంలో మరో లక్ష మంది అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. దీంతో మొత్తం మూడు లక్షల మంది కొత్త లబ్ధిదారులకు సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణ, బడ్జెట్ కేటాయింపులపై ఆర్థిక శాఖ కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ చర్యలతో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు తదితర అర్హుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గ్రామ, వార్డు స్థాయిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుండగా, తుది జాబితాను త్వరలో విడుదల చేసి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభించే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రభుత్వం చేపట్టిన ప్రక్షాళన కీలక ముందడుగుగా మారనుంది.

# కాళేశ్వరం వైఫల్యానికి బీఆర్‌ఎస్‌దే బాధ్యత: ఉత్తమ్

- బ్యారేజీలు దెబ్బతినడంతో పంపింగ్ సాధ్యం కాదన్న మంత్రి
- ఎన్‌డీఎస్‌ఏ నివేదికలను విపక్షాలు విస్మరిస్తున్నాయని విమర్శ




**హైదరాబాద్, జులై 5 :** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితికి పూర్తిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని, సాంకేతిక వాస్తవాలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మంత్రి మాట్లాడుతూ, గత పదేళ్లలో ఇరిగేషన్ రంగంపై రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ రైతులకు స్థిరమైన సాగునీటి ప్రయోజనం కల్పించలేదన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ వంటి ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు దెబ్బతినడంతో ప్రస్తుతం వాటిలో నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని తెలిపారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలో కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు. మేడిగడ్డలో నీటిని నిల్వ చేస్తే ఎగువ ప్రాంతాల్లో ముంపు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని కేంద్ర నిపుణులు హెచ్చరించారని గుర్తుచేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ చేస్తున్న డిమాండ్ సాంకేతికంగా సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రాణహిత నుంచి నీటిని ఎత్తిపోసినా, అది అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు చేరాల్సి ఉంటుందని, ఆ బ్యారేజీలు వినియోగానికి అనువుగా లేకపోవడంతో పంపింగ్‌కు ప్రయోజనం ఉండదని వివరించారు. కాళేశ్వరం పూర్తిస్థాయిలో పనిచేయాలంటే భారీ స్థాయిలో విద్యుత్ అవసరమవుతుందని కాగ్ నివేదికలో కూడా పేర్కొన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. బ్యారేజీల్లో లీకేజీలు, ఇతర సాంకేతిక లోపాలపై అప్పటి ఇంజనీర్లు నివేదికలు ఇచ్చినా, గత ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలను పూర్తిగా విస్మరిస్తూ విపక్షాలు విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని, సాంకేతిక నిపుణుల సూచనల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఆక్సిజన్ అందక నవజాత శిశువు మృతి

**జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో విషాదం**

**సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన**

**సంగారెడ్డి, జూలై 5:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణికి సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉన్న నర్సు, ఆయా కలిసి ప్రసవం నిర్వహించారు. అయితే ప్రసవం అనంతరం నవజాత శిశువు ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. అత్యవసర సమయంలో శిశువుకు ఆక్సిజన్ అందించేందుకు ఆసుపత్రిలో సిలిండర్ అందుబాటులో లేకపోవడంతో శిశువు పరిస్థితి మరింత విషమించి మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, కనీస వైద్య సదుపాయాలు లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఘటనతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# నల్గొండలో ఘోర రోడ్డు ప్రమాదం

**బాలుడితో సహా నలుగురు దుర్మరణం**

**జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు ఢీకొన్న కారు**

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**

**డ్రైవర్‌కు తీవ్ర గాయాలు.. దర్యాప్తు ప్రారంభం**



**నల్గొండ, జులై 5 :** నల్గొండ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నలుగురి ప్రాణాలను బలిగొంది. హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో అతివేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కారును వెనుక నుంచి ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడితో పాటు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రత ఎంత ఘోరంగా ఉందంటే కారులో ప్రయాణిస్తున్న వారికి బయటపడే అవకాశం లేకుండా పోయింది. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే నలుగురు మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్‌ను వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందినవారు తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కుటుంబ సభ్యుల ఆకస్మిక మృతితో బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు నల్గొండకు చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. ట్రావెల్స్ బస్సు అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.



# కాంగ్రెస్ హామీలపై పోరాటం కొనసాగాలి: తలసాని

**తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ సమావేశం**

**ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన**

**పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

**హైదరాబాద్, జులై 4:** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో దొంగ ఓట్లను గుర్తించి తొలగించేలా కృషి చేయాలని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రంజాన్, బతుకమ్మ, క్రిస్మస్ వంటి అన్ని పండుగలను ఘనంగా నిర్వహించామని తలసాని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో అప్పులు చేసినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం అప్పులు చేసినా ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులు కనిపించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్‌ఎస్ కీలక పాత్ర పోషించిందని, పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు చేసిన పోరాటాన్ని ఎవరూ మరచిపోలేరని తలసాని పేర్కొన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తలసాని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీల అమలుపై నిరంతరం పోరాటం కొనసాగించాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# హైదరాబాద్ పట్టణ పాలనకు కొత్త చట్టం

**జీహెచ్‌ఎంసీ చట్టం స్థానంలో సమగ్ర పాలన బిల్లు**

**జూలై 24లోగా ప్రజల నుంచి సూచనలు ఆహ్వానం**

**హైదరాబాద్, జూలై 5:** హైదరాబాద్ మహానగర పట్టణ పాలనలో సమగ్ర మార్పులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 70 ఏళ్ల నాటి జీహెచ్‌ఎంసీ చట్టానికి బదులుగా ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026' ముసాయిదాను అధికారికంగా విడుదల చేసింది. ఈ ముసాయిదాపై ప్రజలు, పట్టణాభివృద్ధి నిపుణులు, వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలను ప్రభుత్వం ఆహ్వానించింది. జూలై 24లోగా ఆన్‌లైన్ లేదా మున్సిపల్ శాఖకు లిఖితపూర్వకంగా తమ సూచనలు పంపవచ్చని వెల్లడించింది. 1955లో రూపొందించిన జీహెచ్‌ఎంసీ చట్టంలోని కాలానుగుణత కోల్పోయిన నిబంధనలను తొలగించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త నిబంధనలు అమలు చేయనున్నారు. ఆధునిక పట్టణ పాలన, వేగవంతమైన పౌర సేవలు, పర్యావరణ పరిరక్షణ, నెట్ జీరో కార్బన్ ఉద్గారాల లక్ష్య సాధనకు ఈ బిల్లులో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. వ్యాపార అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేలా చట్టాన్ని రూపొందించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన ఈ ముసాయిదాను రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పౌరసమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు క్షుణ్ణంగా పరిశీలించి తమ విలువైన సూచనలు అందించాలని ప్రభుత్వం కోరింది.





# రామాలయ విరాళాల చోరీ విచారకరం

## దోషులకు కఠిన శిక్ష పడాల్సిందే

## స్పష్టం చేసిన ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్

**నాగ్‌పూర్:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల గోల్‌మాల్ వ్యవహారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న ఈ అంశంలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందేనని ఆర్ఎస్ఎస్ సరసంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ఆదివారం నాగ్‌పూర్‌లో జరిగిన 'సన్మార్గ్ మైండ్ వెల్నెస్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విరాళాల చోరీ అంశంపై ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి (సర్కార్యవాహ) దత్తాత్రేయ హోసబాలే ఇప్పటికే స్పష్టమైన ప్రకటన విడుదల చేశారని, తాము అధికారికంగా ఆ ప్రకటనకే కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వ్యవహారాన్ని ఒక సాధారణ ఘటనగా తీసుకోకుండా, 'అసాధారణమైనదిగా' పరిగణించాలని సూచించినట్లు తెలిపారు. ఆలయ ఆర్థిక నిర్వహణలో, పరిపాలనా వ్యవస్థలో ఉన్న లోపాలను తక్షణమే సరిదిద్ది, భక్తుల నమ్మకం వమ్ము కాకుండా ఉండేందుకు భవిష్యత్తులో పారదర్శకమైన ఆర్థిక విధానాలను, కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో హిందూ సమాజమంతా అవసరమైన ఓర్పు, సంయమనం పాటించాలని ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చింది. ఈ దురదృష్టకర ఘటనను ఆసరాగా చేసుకుని హిందూ ధర్మాన్ని, సమాజాన్ని అపకీర్తి పాలు చేయడానికి ప్రయత్నించే వ్యతిరేక, విద్రోహ శక్తుల కుట్రలను భక్తులు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేసింది. ఇదే క్రమంలో మోహన్ భాగవత్ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. శారీరక అనారోగ్యం మనిషిని బలహీనపరిచినప్పుడు, అది మానసిక స్థితిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకే సంపూర్ణ ఆరోగ్యానికి ప్రశాంతమైన మనస్సు ఎంతో అవసరమని చెప్పారు. భారతదేశ సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థలైన 'యోగ వాశిష్టం', 'పతంజలి యోగ సూత్రాలు' మనస్సును నియంత్రించే సైన్స్‌ను అద్భుతంగా వివరించాయని, వీటిపై ఉన్నత విద్యాసంస్థల్లో మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మైనర్లపై లైంగిక వేధింపుల కంటెంట్

## మెటా సంస్థకు కేంద్రం నోటీసులు

## ఏడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా దిగ్గజం ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రేరేపించేలా ఉన్న కంటెంట్, అభ్యంతరకర ప్రకటనలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో మైనర్లపై లైంగిక దాడులను ప్రోత్సహించే అన్ని రకాల ప్రకటనలను, కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ శనివారం మెటా సంస్థకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసలు ఇటువంటి అభ్యంతరకరమైన ప్రకటనలను ఇన్‌స్టాగ్రామ్ మోడరేషన్ సిస్టమ్ ఎలా అనుమతించిందని ఐటీ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ప్రశ్నించింది. ఆయా ప్రకటనలను ప్రాథమిక దశలోనే అడ్డుకోవడంలో ఇన్‌స్టాగ్రామ్ అంతర్గత భద్రతా వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయనే విషయాలపై రాబోయే 7 రోజులలోగా సమగ్ర వివరణాత్మక నివేదిక సమర్పించాలని మెటాను ఆదేశించింది. కాగా, చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రేరేపించేలా ఉండే కంటెంట్‌కు సంబంధించిన యాడ్స్ భారత్‌లోని పలు ఇన్‌స్టా అకౌంట్స్‌లో బహిరంగంగా కనిపించాయంటూ బ్రిటన్ ప్రసార సంస్థ బీబీసీ ఒక పరిశోధనాత్మక కథనాన్ని ప్రచురించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఈ అశ్లీల ప్రకటనలు పలు టెలిగ్రామ్ ఛానల్స్ లింకులకు సంబంధించినవని, కేవలం 99 రూపాయలకే ఆ కంటెంట్ లభిస్తుందంటూ ఇన్‌స్టాలో యాడ్స్ దర్శనమిచ్చాయని ఆ కథనంలో బట్టబయలు చేశారు. ఈ బీబీసీ పరిశోధనాత్మక కథనంపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే స్పందించి ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. దేశంలో బాలల భద్రతకు భంగం కలిగించేలా ఉన్న ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఆయన, తక్షణమే మెటా ఉన్నతాధికారులను పిలిపించి విచారించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి ఆదేశాల నేపథ్యంలోనే ఐటీ మంత్రిత్వ శాఖ మెటాకు అధికారికంగా నోటీసులు జారీ చేస్తూ, నిబంధనల ఉల్లంఘనలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని ఐటీ చట్టాలు, బాలల సంరక్షణ నిబంధనల ప్రకారం ఇటువంటి కంటెంట్‌ను ప్రసారం చేయడం తీవ్రమైన నేరమని స్పష్టం చేసిన కేంద్రం, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా మెటా ఎలాంటి పటిష్ట చర్యలు తీసుకోబోతోందో కూడా నివేదికలో స్పష్టం చేయాలని నోటీసుల్లో పేర్కొంది.

# ఇరాన్ నేతల ఏడుపు.. అంతా ఫేక్!..

- నోటి దురుసు ప్రదర్శించిన డొనాల్డ్ ట్రంప్
- ఒక్క షాట్‌తో తుడిచిపెట్టేయగలమంటూ వివాదాస్పద వ్యాఖ్యలు





**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా ఖామ్రేనీ ఖమేనీ అంత్యక్రియల వేళ.. ఆ దేశంలో మిగిలి ఉన్న కీలక నాయకత్వాన్ని తాము ఒకే ఒక్క షాట్‌తో అంతమొందించగలమని ఆయన పేర్కొన్నారు. అయితే, అలా చేస్తే భవిష్యత్తులో శాంతి చర్చలు జరపడానికి అవతలి పక్షంలో ఎవరూ మిగలరు కాబట్టి తాను ఆ పని చేయడం లేదని ట్రంప్ వివరించారు. అదే సమయంలో ఖమేనీ అంత్యక్రియల్లో తీవ్ర ఆవేదనతో కన్నీరు మున్నీరవుతున్న ఇరాన్ అగ్రనేతలను ఉద్దేశిస్తూ ట్రంప్ తన నోటికి పని చెప్పారు. అమెరికన్ మీడియా సంస్థ 'ఆక్సియోస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరాన్ నేతలందరూ ఖమేనీ అంత్యక్రియల్లో ఉన్నారని, ఒక్క దెబ్బతో వారందరినీ తాము తుడిచిపెట్టేయగలమని, కానీ తాము ఆ పని చేయబోవడం లేదని అన్నారు. నిజానికి ఆ దేశ నేతలు ప్రస్తుతం అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడానికి తీవ్రంగా అర్థిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు ముగిసే వరకు ఉభయ పక్షాల మధ్య చర్చల నుంచి వారం రోజుల పాటు తాత్కాలిక విరామం తీసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నట్లు కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ లోపు ఏ పక్షం కూడా అవతలి దేశంపై ఎలాంటి దాడులు చేయబోవని ఆయన వెల్లడించారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ గాలిబాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలు కన్నీరు పెట్టుకుంటూ కనిపించగా, ఇరాన్ నేతలు, ప్రజలు అలా భావోద్వేగానికి లోనై ఏడవడంపై డొనాల్డ్ ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు ఖమేనీని తీవ్రంగా ద్వేషిస్తారని తాను భావించానని, బహుశా అంత్యక్రియల్లో వారు కార్చేవి నకిలీ కన్నీళ్లు కావచ్చు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో ఖమేనీ మరణించగా, యుద్ధ పరిస్థితుల కారణంగా వాయిదా పడుతూ వచ్చిన ఈ అంతిమ సంస్కారాలు జూలై మొదటి వారంలో ప్రారంభమై ప్రస్తుతం ఇరాన్, ఇరాక్‌లలోని 5 ప్రధాన నగరాల్లో అధికారికంగా కొనసాగుతున్నాయి.

# హోర్ముజ్‌పై ఇరాన్ కొత్త నిర్ణయం

- వాణిజ్య నౌకలకు సేవా రుసుము..
- మిత్ర దేశాలకు ప్రత్యేక రాయితీలు
- ప్రయాణ భద్రత, పర్యవేక్షణకు ఒమన్‌తో కలిసి చర్యలు
- సైనిక విన్యాసాలకు హోర్ముజ్ వేదిక కాదన్న ఇరాన్



**టెహ్రాన్, జూలై 5:** ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధి వినియోగంపై ఇరాన్ కీలక నిర్ణయం ప్రకటించింది. ఇకపై ఈ మార్గం గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల నుంచి సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు వెల్లడించింది. అయితే ఇరాన్‌తో స్నేహపూర్వక సంబంధాలు కలిగిన దేశాలకు ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు కల్పిస్తామని స్పష్టం చేసింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దుల్ రెజా రహ్మానీ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లో భాగమని, అక్కడ విధించే చార్జీలు టోల్ రూపంలో కాకుండా సేవా రుసుములుగా ఉంటాయని తెలిపారు. నౌకల రాకపోకల పర్యవేక్షణ, సముద్ర ప్రయాణ భద్రత వంటి సేవలను ఒమన్ సహకారంతో నిర్వహిస్తామని చెప్పారు. హోర్ముజ్ వినియోగానికి సంబంధించిన సేవా రుసుముల విషయంలో మిత్ర దేశాలకు ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు రహ్మానీ వెల్లడించారు. ఈ అంశంపై ఒమన్‌తో సమగ్ర చర్చలు జరపనున్నట్లు తెలిపారు. అదే సమయంలో హోర్ముజ్ జలసంధిని ఇతర దేశాలు సైనిక విన్యాసాలకు వేదికగా ఉపయోగించకూడదని ఇరాన్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ సముద్ర రవాణా భద్రతను పరిరక్షిస్తూ, ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని పేర్కొంది.

# 2027లో యూపీలో ఎన్డీయే మళ్లీ అధికారంలోకి..

- అఖండ విజయం మాదేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా
- మోదీ-యోగి పాలనపై ప్రజలకు విశ్వాసం
- 2017 విజయాన్ని 2027లో పునరావృతం



**లఖ్‌నవూ, జూలై 5:** ఉత్తర్‌ప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించి మరోసారి అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే విజయానికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో రెండు రోజుల సంస్థాగత పర్యటనలో భాగంగా లఖ్‌నవూలో పార్టీ పదాధికారులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నాయకులతో నితిన్ నబిన్ సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికల వ్యూహం, సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే పార్టీ బీజేపీయేనని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం సమిష్టిగా పనిచేసిందని, ప్రజలు మరోసారి భారీ మెజారిటీతో ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలు గుండాయిజం, వంశపారంపర్య రాజకీయాలను తిరస్కరించి అభివృద్ధి రాజకీయాలకు మద్దతు ఇస్తున్నారని అన్నారు. రాబోయే 21 ఏళ్లపాటు సమాజ్‌వాదీ పార్టీ అధికారానికి దూరంగానే ఉంటుందని వ్యాఖ్యానించారు. 2017లో సాధించిన చారిత్రాత్మక విజయాన్ని 2027లో మరింత భారీ స్థాయిలో పునరావృతం చేస్తామని చెప్పారు. యూపీ మంత్రి భూపేంద్ర చౌదరి మాట్లాడుతూ, సమాజ్‌వాదీ పార్టీ సమాజాన్ని కులాలు, భాషలు, ప్రాంతాల పేరుతో విభజించే రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. అభివృద్ధే ఎన్డీయే ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. నితిన్ నబిన్ పర్యటనతో ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2027 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఎన్డీయే కార్యాచరణను వేగవంతం చేసింది.

# ప్రియురాలి కోసం భారత్‌లోకి చొరబాటు

- పాక్ యువకుడిని అప్పగించిన ఆర్మీ
- కమాన్ అమన్ సేతు వద్ద ప్రక్రియ పూర్తి



**శ్రీనగర్:** ఆన్‌లైన్ ప్రేమలో పడి సరిహద్దులు దాటి ప్రియురాలి కోసం భారతదేశంలోకి చొరబడిన పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ యువకుడిని భారత సైన్యం తిరిగి మానవతా దృక్పథంతో సొంత దేశానికి పంపించివేసింది. నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి వచ్చిన సదరు 22 ఏళ్ల యువకుడిని శనివారం మధ్యాహ్నం 12:24 గంటలకు భారత ఆర్మీ అధికారులు అధికారికంగా పాక్ సైన్యానికి అప్పగించారు. ఈ సరిహద్దు బదిలీ వ్యవహారానికి సంబంధించిన వివరాలను చినార్ కార్ప్స్ ఇండియన్ ఆర్మీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. గత మే 31వ తేదీన ఉరీ సెక్టార్‌లో నియంత్రణ రేఖ దాటుతుండగా పట్టుబడిన పీఓకే నివాసి జీషన్ మీర్‌ను కమాన్ అమన్ సేతు సరిహద్దు వద్ద పాక్ ఆర్మీ అధికారులకు అప్పగించినట్లు ఆర్మీ పేర్కొంది. భారతదేశంలో కస్టడీలో ఉన్న సమయంలో జీషన్ మీర్‌ను భారత సైన్యం ఎంతో గౌరవంతో, మానవీయ విలువలతో చూసుకుందని, ఇది భారత సైన్యానికి వృత్తిపరమైన ప్రవర్తన పట్ల ఉన్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని చినార్ కార్ప్స్ స్పష్టం చేసింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫరాబాద్, పైన్‌కడి ప్రాంతానికి చెందిన జీషన్ అహ్మద్ మిర్‌కు కొన్ని నెలల క్రితం జమ్మూకాశ్మీర్‌లోని ఉరీ సెక్టార్‌కు చెందిన ఐరమ్ బానో అనే యువతితో ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా క్రమంగా ప్రేమగా మారడంతో, ఎలాగైనా తన ప్రియురాలిని నేరుగా కలవాలని జీషన్ నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలోనే గత మే 31వ తేదీ ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఎలాంటి వీసా, పాస్‌పోర్టు ఆధారాలు లేకుండా పాక్ సరిహద్దుల నుండి గుట్టుచప్పుడు కాకుండా భారత్‌లోకి చొరబడ్డాడు. అయితే సరిహద్దుల్లో డేగకన్నుతో నిఘా ఉంచిన భారత భద్రతా దళాలు అతడి కదలికలను గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నాయి. అదే సమయంలో నియంత్రణ రేఖకు సమీపంలోని నిర్దేశిత ప్రాంతంలో ప్రియుడి రాక కోసం వేచి చూస్తున్న స్థానిక యువతి ఐరమ్ బానోను కూడా రక్షణ దళాలు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం యువకుడి ఉద్దేశం కేవలం ప్రేమ వ్యవహారమేనని, ఎలాంటి విద్రోహ చర్యల నేపథ్యం లేదని విచారణలో తేలడంతో చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి శనివారం అతడిని పాక్ అధికారులకు అప్పగించారు.

# ముత్యాలమ్మ సన్నిధిలో భక్తి, అన్నదానంతో మంత్రి పొంగులేటి శ్రీనన్న

**బోదులబండలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు, మహా అన్నదానం ప్రారంభం**





**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

జననేత, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాకతో నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామం ఆదివారం భక్తి, ఆధ్యాత్మిక, రాజకీయ కోలాహలంతో నిండిపోయింది. గ్రామంలో కనులపండువగా నిర్వహించిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.మంగళవాయిద్యాల మోతలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటి.. అమ్మవారి దివ్య స్వరూపాన్ని దర్శించుకుని వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలను బహూకరించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్నదాన వితరణను మంత్రి ఘనంగా ప్రారంభించారు. భక్తులకు స్వయంగా వడ్డించి వారితో మమేకమై అందరి మన్ననలు పొందారు.

**"రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి"**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.



## చెన్నారం గ్రామంలో విషాద కుటుంబాలను పరామర్శించిన కందాళ ఉపేందర్ రెడ్డి

**"ఈ కష్టకాలంలో అండగా ఉంటాం" - మాజీ ఎమ్మెల్యే భరోసా**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

నేలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో ఇటీవల కుటుంబ పెద్దలను కోల్పోయి దుఃఖంలో ఉన్న కుటుంబాలను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఆదివారం పరామర్శించారు. మృతుల ఇళ్లకు వెళ్లిన ఆయన, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫోటోలో కూడా ఒక ఇంట్లో మృతుని ఫోటోకు పూలదండ వేసి, కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న దృశ్యం కనిపించింది. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడిన ఉపేందర్ రెడ్డి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. "ఇది తీరని లోటు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలి. మీకు ఏ అవసరం వచ్చినా మేము అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన.కొక్కిరేణి వెంకటయ్య కుటుంబం, తోళ్ల నాగయ్య కుటుంబం,రేసు భారతమ్మ కుటుంబం కమధన కిషన్‌రావు కుటుంబంలను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుల సేవలను కొనియాడుతూ, వారి కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చాగంటి మధుసూదన్‌రావు, కిలారి వెంకన్న, కోదాడ శ్రీను, అవుట మధు, రౌత్ గోపాల్‌రావు, చాగంటి కిషన్‌రావు, చెకూరి గురవయ్య, తోళ్ల రవి, తోళ్ల శ్రీను, నెల్లూరు రవి, తోళ్ల నాగేశ్వరావు, గంజికుంట్ల నాగార్జున, షేక్ అబ్బల్, పుల్లయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే స్వయంగా వచ్చి పరామర్శించడంతో బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

# రామారెడ్డిలో మొదటి తుర్కకాశ జెండా ఎగిరింది




**హాజరైన రాష్ట్ర కమిటీ సభ్యులు పలు జిల్లా అధ్యక్షులు**

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :**

తెలంగాణ తుర్కకాశ సంక్షేమ సంఘం జెండా కామారెడ్డి జిల్లాలో రామారెడ్డి మండలంలో మొదటి జెండాను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్ మాట్లాడుతూ. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఐకమత్యమే మహా బలమని తెలిపారు. ప్రతి యేటా తెలంగాణ తురకకాశ సంక్షేమ సంఘానికి వందల కోట్ల బడ్జెట్ లక్ష్యంగా కృషి చేద్దామని ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు ఉపాధ్యక్షులు అబ్దుల్ రహీం, శాదుల్లా, లీగల్ సెల్ అడ్వైజర్ యామిన్ భాష, ప్రచార కార్యదర్శి సయ్యద్ ముఖిమ్ , రాష్ట్ర కమిటీ సభ్యులు నూరు మొహమ్మద్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మోతి, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గౌస్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, కామరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్, ఉపాధ్యక్షులు షేక్ యాదుల్, బిక్నూర్ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్, మండల ఉపాధ్యక్షుడు సయ్యద్ షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# పోసానిపేటలో ఓటర్ ఐడి కార్డు ప్రక్షాళన

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో ఎలక్షన్ ఓటర్ ఐడి కార్డ్ ప్రక్షాళన చేశారు, కార్యక్రమంలో ఆర్ ఐ నరేష్ జిపిఓ కిషన్, గ్రామ సర్పంచ్ సుద్దాల లింగం, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు టంకరి రవి, మాజీ రైతుబంధు అధ్యక్షులు సిహెచ్ తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్ ఉమామహేశ్వర రావు, మాజీ ఉపసర్పంచ్ మేర రవీందర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగరాజు, శ్రీనివాసరెడ్డి, గాండ్ల రవి గ్రామస్తులు పాల్గొన్నారు.

# నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్

- మరో ముగ్గురు నిందితులు అదుపులో
- నగదు, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడి



**సత్తుపల్లి, జులై 05 (రాజముద్ర న్యూస్):**

వేంసూరు పోలీసులు నకిలీ పోలీసులుగా నటించి డబ్బులు దోచుకున్న ముఠాలో మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.50 లక్షల నగదు, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులు అరెస్టు కాగా, మిగిలిన వారిపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# గాడ్రాలలో సంతాప సభ

- ఆశయాలను కొనసాగించాలని పిలుపు
- పార్టీ నేతల నివాళులు

**అశ్వారావుపేట, జూలై 05 :**

అశ్వారావుపేట మండలం గాడ్రాల గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సీనియర్ నాయకుడు కాక భూపతి మృతికి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ కాక భూపతి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు



# అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నూతన బ్యారక్స్ ప్రారంభం

- పోలీసుల సంక్షేమానికి మరో అడుగు
- మహిళా, పురుషుల కోసం ఆధునిక వసతి సదుపాయాలు-
- ప్రారంభించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్

**హైదరాబాద్, జూలై 5 :**



పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మహిళా, పురుషుల బ్యారక్స్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి విధి నిర్వహణలో సామర్థ్యం, ఉత్సాహం మరింత పెరుగుతుందని అన్నారు. సిబ్బంది సంక్షేమం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు.మహిళా, పురుషుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఈ బ్యారక్స్‌లో ఆధునిక వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. విధుల్లో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బందికి సౌకర్యవంతమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం, పోలీసు శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచే చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీసు అధికారులు, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి లేని కళాశాలల్లో చేరి మోసపోవద్దు: వీసీ సజ్జనార్

**హైదరాబాద్, జూలై 5 :** అనుమతి లేని డిగ్రీ కళాశా లల్లో చేరి మోసపోవద్దని వీసీ సజ్జనార్ ఐపీఎస్ విద్యార్థు లు, వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు లేకపోయినా ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్న విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలు కళాశాలలపై విచారణ చేపట్టగా, కొన్ని విద్యాసంస్థలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి అనుబంధ గుర్తింపు లేదని తేలినట్లు తెలిపారు. అయినప్పటికీ ఓయూ అఫిలియేషన్ ఉందంటూ తప్పుడు ప్రకటనలతో విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ప్రచారాలతో ప్రవేశాలు నిర్వహిస్తున్న కళాశాలలపై హైదరాబాద్ నగర పోలీసులు చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.




# రెండు రోజులుగా పెరుగుతున్న బంగారం ధరలు

**హైదరాబాద్, జూలై 5:** గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. వరుసగా రెండో రోజూ పసిడి ధరలు పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం, శనివారం ఉదయం 6 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,760కు చేరుకుంది. వెండి ధర కూడా స్వల్పంగా పెరిగింది. కిలో వెండి ధర రూ.100 పెరిగి హైదరాబాద్, విజయవాడలో రూ.2,60,100గా ఉంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010, 22 క్యారెట్ల ధర రూ.1,34,760, 18 క్యారెట్ల ధర రూ.1,10,260గా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. 24 క్యారెట్ల బంగారం రూ.1,47,010, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,760, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,260గా ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర అత్యధికంగా రూ.1,49,570గా నమోదైంది. న్యూఢిల్లీలో రూ.1,47,160, అహ్మదాబాద్‌లో రూ.1,47,060, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,47,010గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల కదలికలు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్ వంటి అంశాల ప్రభావంతో పసిడి ధరలు మారుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఇంధన నిల్వలపై కేంద్రం కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, జూలై 5:** దేశంలో ముడి చమురు నిల్వలు తగినంతగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం భారతదేశం వద్ద సుమారు 76 నుంచి 80 రోజుల వరకు దేశ అవసరాలకు సరిపడే ముడి చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. దీంతో ప్రస్తుతం దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని అధికారులు తెలిపారు. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12 ఉండగా, డీజిల్ ధర రూ.95.20గా ఉంది. ముంబైలో పెట్రోల్ రూ.111.21, డీజిల్ రూ.97.83కు విక్రయిస్తున్నారు. కోల్‌కతాలో పెట్రోల్ రూ.113.51, డీజిల్ రూ.99.82గా ఉండగా, చెన్నైలో పెట్రోల్ రూ.107.77, డీజిల్ రూ.99.55గా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇంధన ధరలు దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొంత ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.115.69, డీజిల్ ధర రూ.103.82గా ఉండగా, విజయవాడలో పెట్రోల్ రూ.117.25, డీజిల్ రూ.104.96గా నమోదైంది. స్థానిక పన్నులు, రవాణా వ్యయం కారణంగానే ఈ నగరాల్లో ధరలు అధికంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాంతాన్ని బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఇంధన ధరలు తగ్గే అవకాశాలపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం విక్రయిస్తున్న ఇంధనం దాదాపు రెండు నెలల క్రితమే దిగుమతి చేసుకున్న ముడి చమురుతో తయారైనదని తెలిపారు. ఆ సమయంలో మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, రవాణా వ్యయం, బీమా ఖర్చులు భారీగా పెరిగాయని మంత్రి వివరించారు. ఆ ప్రభావంతో అధిక ధరలకు కొనుగోలు చేసిన చమురు భారాన్ని ప్రస్తుతం ప్రభుత్వ రంగ చమురు సంస్థలే భరిస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు స్థిరపడిన తర్వాతే దేశీయంగా ఇంధన ధరలపై సమీక్ష జరిగే అవకాశం ఉందని, అప్పటి వరకు ప్రస్తుత ధరల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# ఏఐ నైపుణ్యాలకు భారీ డిమాండ్

## ఐటీ నియామకాలు తగ్గినా అవకాశాలు



**హైదరాబాద్, జూలై 5:** దేశంలో సేవల రంగంలో ఉద్యోగ నియామకాల వేగం కొంత మందగించినప్పటికీ, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులకు డిమాండ్ మాత్రం వేగంగా పెరుగుతోంది. మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా సంస్థలు తమ వ్యాపార విధానాలను మార్చుకుంటుండటంతో ఏఐ నిపుణుల నియామకాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నౌకరీ.కామ్ తన తాజా ఉద్యోగ నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం, జూన్ నెలలో ఐటీ రంగంలో మొత్తం ఉద్యోగ నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 3 శాతం తగ్గాయి. అయితే, ఏఐకు సంబంధించిన ఉద్యోగాల భర్తీ మాత్రం 16 శాతం పెరిగింది. దేశవ్యాప్తంగా 1.5 లక్షలకు పైగా కంపెనీలు విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఇన్ఫో ఎడ్జ్ (నౌకరీ మాతృ సంస్థ) సీఈఓ హితేష్ ఒబెరాయ్ మాట్లాడుతూ, ఏఐ ప్రస్తుతం అదనపు నైపుణ్యం మాత్రమే కాకుండా సంస్థలకు అత్యంత కీలకమైన సామర్థ్యంగా మారిందన్నారు. భవిష్యత్తులో ఏఐ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కూడా ఐటీ రంగంలో నియామకాల వేగం దీర్ఘకాలంలో మరింత మందగించే అవకాశం ఉందని తెలిపింది. సంస్థల్లో సంప్రదాయ ఉద్యోగులతో పాటు ఏఐ ఏజెంట్ల వినియోగం కూడా వేగంగా పెరుగుతోందని టీసీఎస్ అభిప్రాయపడింది. ఏఐ డేటా సెంటర్ల నిర్మాణం వేగవంతం కావడంతో మెకానికల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ వంటి కోర్ విభాగాల ఇంజనీర్లకు కూడా భారీగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థలు, కూలింగ్ టెక్నాలజీ, థర్మల్ మేనేజ్‌మెంట్, డేటా సెంటర్ డిజైన్‌లో నైపుణ్యం ఉన్న వారికి కంపెనీలు అధిక వేతనాలతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం, దేశంలో డేటా సెంటర్ల మొత్తం నిర్వహణ సామర్థ్యం 2025లో 1.6 గిగావాట్లుగా ఉండగా, 2030 నాటికి అది 5 గిగావాట్లకు పెరగనుంది. దీంతో ఏఐతో పాటు మౌలిక వసతుల రంగాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# వాహన బీమా.. ముందు జాగ్రత్త!




**హైదరాబాద్, జూలై 5:** కొత్త వాహనం కొనుగోలు చేయడం ప్రతి కుటుంబానికి ఒక సంతోషకరమైన సందర్భం. వాహనం ఇంటికి వచ్చిన తర్వాత దాని ధర, రూపు, సౌకర్యాలు, పనితీరు వంటి అంశాల గురించి తెలుసుకోవడానికి అందరూ ఆసక్తి చూపుతారు. అయితే అదే సమయంలో వాహన బీమా విషయంలో చాలామంది సరైన అవగాహన లేకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ అనుకోకుండా ప్రమాదం జరిగి బీమా క్లెయిమ్ చేయాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు మాత్రమే దాని విలువ తెలుస్తుంది. అందుకే వాహన బీమా తీసుకునే ముందు కొన్ని కీలక అంశాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని బీమా నిపుణులు సూచిస్తున్నారు. మోటారు వాహన బీమాలో ప్రధానంగా రెండు రకాల పాలసీలు అందుబాటులో ఉంటాయి. ఒకటి థర్డ్ పార్టీ బీమా. ఇది చట్టపరంగా ప్రతి వాహనానికి తప్పనిసరి. ప్రమాదంలో ఇతరులకు కలిగే గాయాలు లేదా ఆస్తి నష్టాలకు ఈ బీమా రక్షణ కల్పిస్తుంది. మరోవైపు సమగ్ర బీమా పాలసీ తీసుకుంటే ఇతరులకు కలిగే నష్టాలతో పాటు సొంత వాహనానికి కలిగే నష్టానికీ పరిహారం లభిస్తుంది. అందువల్ల సమగ్ర బీమా పాలసీని ఎంచుకోవడం వల్ల ఎక్కువ రక్షణ లభిస్తుంది. వాహనం పూర్తిగా ధ్వంసమైనా లేదా దొంగతనానికి గురైనా బీమా సంస్థ చెల్లించే గరిష్ఠ మొత్తాన్ని బీమా ప్రకటిత విలువగా పరిగణిస్తారు. కొత్త వాహనాలకు షోరూమ్ ధర ఆధారంగా ఈ మొత్తాన్ని నిర్ణయిస్తారు. వాహనం పాతబడే కొద్దీ ఈ విలువ కూడా మారుతుంది. బీమా పునరుద్ధరణ సమయంలో దీనిని సరైన స్థాయిలో నిర్ణయించడం చాలా ముఖ్యం. విలువ ఎక్కువగా నిర్ణయిస్తే ప్రీమియం పెరుగుతుంది. తక్కువగా నిర్ణయిస్తే క్లెయిమ్ సమయంలో తక్కువ పరిహారం మాత్రమే లభిస్తుంది. సమగ్ర బీమా పాలసీలో అదనపు రక్షణ సదుపాయాలను కూడా ఎంచుకోవచ్చు. వాహన భాగాల తరుగుదలను లెక్కించకుండా పూర్తి క్లెయిమ్ అందించే సదుపాయం, వరదల వల్ల ఇంజిన్ దెబ్బతింటే పరిహారం అందించే రక్షణ, వాహనం పూర్తిగా నష్టపోతే కొనుగోలు సమయంలో చెల్లించిన మొత్తం వరకు పరిహారం అందించే ప్రత్యేక సదుపాయం వంటి ప్రయోజనాలు వాహన యజమానులకు ఎంతో ఉపయోగపడతాయి. అలాగే వాహనాన్ని తక్కువగా వినియోగించే వారికి వినియోగానికి అనుగుణంగా ప్రీమియం నిర్ణయించే ప్రత్యేక బీమా పథకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. బీమా పాలసీ తీసుకునే ముందు వాహన నంబరు, యజమాని పేరు, చిరునామా వంటి వివరాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించడం అవసరం. చిన్న పొరపాట్లు కూడా క్లెయిమ్ ప్రక్రియలో జాప్యానికి లేదా తిరస్కరణకు కారణవుయ్యే అవకాశం ఉంటుంది. అలాగే వరద నీటిలో వాహనం చిక్కుకుంటే ఇంజిన్‌ను స్టార్ట్ చేయకుండా వెంటనే సమీపంలోని మరమ్మతుల కేంద్రానికి తరలించి బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల ఇంజిన్‌కు మరింత నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. వాహనానికి సమగ్ర బీమా తీసుకోవడం అనేది కేవలం చట్టపరమైన అవసరం మాత్రమే కాదు. అనుకోని ప్రమాదాల సమయంలో భారీ ఆర్థిక నష్టాన్ని నివారించే రక్షణ కవచం కూడా. అందువల్ల బీమా పాలసీ ఎంపికలో నిర్లక్ష్యం చేయకుండా అన్ని వివరాలు తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకోవడం వాహన యజమానులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

# ట్రంప్ మెమ్ కాయిన్‌తో పెట్టుబడిదారులకు భారీ నష్టం




**వాషింగ్టన్, జూలై 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో విడుదలైన ట్రంప్ మెమ్ కాయిన్ విలువ భారీగా పడిపోవడంతో లక్షలాది మంది పెట్టుబడిదారులు తీవ్ర నష్టాలను చవిచూశారు. మరోవైపు ఈ ప్రాజెక్టు ద్వారా ట్రంప్, ఆయన అనుబంధ సంస్థలు వందల మిలియన్ డాలర్ల ఆదాయం పొందినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. దీంతో ఈ వ్యవహారం అమెరికాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బ్లాక్‌చెయిన్ విశ్లేషణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం, జూన్ చివరి నాటికి దాదాపు 9.89 లక్షల డిజిటల్ వాలెట్లు నష్టాల్లో ఉన్నట్లు గుర్తించారు. ట్రంప్ మెమ్ కాయిన్ కొనుగోలు చేసిన వారిలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు నష్టపోయినట్లు నివేదిక పేర్కొంది. ఈ కాయిన్ 2025 జనవరిలో విడుదలైనప్పుడు ఒక్కో టోకెన్ ధర 75.35 డాలర్ల వరకు చేరుకుంది. అయితే ప్రస్తుతం దాని విలువ 1.76 డాలర్లకు పడిపోవడంతో పెట్టుబడిదారులు మొత్తం కలిపి సుమారు 3.81 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసినట్లు అంచనా వేస్తున్నారు. ఈ కాయిన్‌లో పెట్టుబడి పెట్టిన పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐదు లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి అందులో సగానికి పైగా కోల్పోయినట్లు ఒక పెట్టుబడిదారు వెల్లడించారు. దేశాధ్యక్షుడిపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఉపయోగించుకుని ఇలాంటి డిజిటల్ టోకెన్లను ప్రోత్సహించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే కాయిన్ విలువ పడిపోయినా ట్రంప్‌కు మాత్రం భారీ ఆదాయం వచ్చినట్లు సమాచారం. ప్రతి కొనుగోలు, అమ్మకంపై వసూలయ్యే లావాదేవీ రుసుములో కొంత భాగం ట్రంప్, ఆయన అనుబంధ సంస్థలకు వెళ్లే విధంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. ఈ విధంగా ట్రంప్ ఈ ఒక్క మెమ్ కాయిన్ ద్వారానే సుమారు 636 మిలియన్ డాలర్ల ఆదాయం పొందినట్లు ఆయన వార్షిక ఆర్థిక వివరాలు సూచిస్తున్నాయి. అలాగే గత ఏడాది వివిధ వ్యాపారాల ద్వారా మొత్తం 2.2 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడైంది. ఈ ఆరోపణలను అమెరికా అధ్యక్ష భవనం ఖండించింది. ట్రంప్ తన మద్దతుదారులను మోసం చేశారనే ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేసింది. అమెరికాను ప్రపంచ డిజిటల్ కరెన్సీ కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. ఇదిలా ఉండగా, ట్రంప్ కుటుంబం ప్రారంభించిన మరో డిజిటల్ కరెన్సీ ప్రాజెక్టు కూడా భారీగా విలువ కోల్పోయినట్లు సమాచారం. ప్రారంభంలో భారీగా పెట్టుబడులు ఆకర్షించిన ఈ టోకెన్ కూడా తర్వాత తీవ్ర పతనాన్ని చవిచూసింది. దీంతో డిజిటల్ కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి అవగాహనతో నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# అత్యధికంగా అమ్ముడైన కార్లు

**న్యూఢిల్లీ, జూలై 5:** దేశీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో గత జూన్ నెలకు సంబంధించిన కార్ల అమ్మకాల గణాంకాలు విడుదలయ్యాయి. ఈసారి అత్యధికంగా అమ్ముడైన కార్ల జాబితాలో టాటా మోటార్స్ ఆధిపత్యం చాటుకుంది. సంస్థకు చెందిన టాటా పంచ్, టాటా నెక్సాన్ మోడళ్లు తొలి రెండు స్థానాలను దక్కించుకుని మార్కెట్లో తమ సత్తా చాటాయి. గత నెలలో టాటా పంచ్ మొత్తం 21,006 యూనిట్ల విక్రయాలతో దేశంలోనే అత్యధికంగా అమ్ముడైన కారుగా మొదటి స్థానంలో నిలిచింది. అదే సంస్థకు చెందిన టాటా నెక్సాన్ 18,335 యూనిట్ల అమ్మకాలతో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. కాంపాక్ట్ క్రీడా వినియోగ వాహనాల విభాగంలో ఈ రెండు మోడళ్లకు వినియోగదారుల నుంచి భారీ ఆదరణ లభించడంతో టాటా మోటార్స్ మార్కెట్ వాటా మరింత బలపడింది. మరోవైపు దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ అత్యధిక మోడళ్లతో తొలి పది స్థానాల్లో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. మారుతీ డిజైర్ 17,899 యూనిట్ల విక్రయాలతో మూడో స్థానంలో నిలవగా, వ్యాగన్ ఆర్ 16,952 యూనిట్లతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. మారుతీ ఎర్టిగా 16,111 యూనిట్లతో ఐదో స్థానంలో నిలవగా, మారుతీ స్విఫ్ట్ 15,215 యూనిట్ల విక్రయాలతో ఆరో స్థానాన్ని సొంతం చేసుకుంది. మహీంద్రా స్కార్పియో 14,097 యూనిట్ల అమ్మకాలతో ఏడో స్థానంలో నిలిచి క్రీడా వినియోగ వాహనాల విభాగంలో తన ప్రజాదరణను కొనసాగించింది. మారుతీ ఫ్రాంక్స్ 13,135 యూనిట్లతో ఎనిమిదో స్థానంలో నిలవగా, మారుతీ బాలెనో 12,488 యూనిట్లతో తొమ్మిదో స్థానాన్ని దక్కించుకుంది. హ్యుందాయ్ వెన్యూ 10,776 యూనిట్ల విక్రయాలతో పదో స్థానంలో నిలిచి అత్యధికంగా అమ్ముడైన కార్ల జాబితాలో చోటు సంపాదించింది. జూన్ నెల అమ్మకాల గణాంకాలను పరిశీలిస్తే, కాంపాక్ట్ క్రీడా వినియోగ వాహనాలు, కుటుంబ అవసరాలకు అనువైన హ్యాచ్‌బ్యాక్, సెడాన్ మోడళ్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ కొనసాగుతున్నట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ధోరణి రానున్న నెలల్లో కూడా కొనసాగుతుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# వెళ్లి ఇండియా పిచ్‌లపై ఆడుకో..

## నువ్వు విదేశాల్లో పనికిరావు.. ■ మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు



**లండన్/న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ని ప్లేయింగ్ ఎలెవన్ లోకి తీసుకోవడంపై భారత మాజీ క్రికెటర్ క్రిస్ శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో బిష్ణోయ్ 4 ఓవర్లలో ఏకంగా 60 పరుగులు సమర్పించుకున్నాడు. ముఖ్యంగా అతను వేసిన 17వ ఓవర్లో ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెథెల్ చెలరేగి 29 పరుగులు రాబట్టాడు. ఈ ఒక్క ఓవర్ మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. అంతిమంగా ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో టీమ్ మేనేజ్‌మెంట్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయాలపై శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఘాటుగా స్పందించారు. బిష్ణోయ్ వేసిన ఆ 17వ ఓవర్ అత్యంత పేలవంగా సాగిందని, బెథెల్ అతడిని ముక్కలు ముక్కలు చేశాడని శ్రీకాంత్ అన్నారు. ఆ ఓవరే భారత్ చేతుల్లోంచి మ్యాచ్‌ను లాగేసుకుందని విమర్శించారు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ (==) తరఫున బిష్ణోయ్ కనీసం సగం మ్యాచ్‌లు కూడా ఆడలేదని, అలాంటి ఆటగాడిని నేరుగా జట్టులోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఆటగాళ్ల పాత రికార్డులను చూసి ఎంపిక చేయడం సరికాదని, ప్రస్తుత ఫామ్‌ను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని హితవు పలికారు.

### కుల్దీప్ యాదవ్ ప్రస్తావన..

కుల్దీప్ యాదవ్ ఇటీవల ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో అతడిని ప్లేయింగ్ ఎలెవన్ నుండి తొలగించడం సరైనదేనని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే, బిష్ణోయ్ కంటే కుల్దీప్‌ను కనీసం స్క్వాడ్‌లోనైనా ఉంచి ఉండాల్సిందని పేర్కొన్నారు. ఇంగ్లాండ్ పిచ్‌ల వాతావరణ పరిస్థితులకు ముగ్గురు స్పిన్నర్లు అవసరం లేదని శ్రీకాంత్ స్పష్టం చేశారు. వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రూపంలో ఇద్దరు స్పిన్నర్లు సరిపోతారని.. బిష్ణోయ్‌కు బదులుగా యువ ఆటగాడు ప్రిన్స్ యాదవ్ కు అవకాశం ఇచ్చి ఉంటే జట్టు సమతుల్యత బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. బిష్ణోయ్ కేవలం భారత పిచ్‌లపైనే ప్రభావం చూపగలడని తేల్చి చెప్పారు.

# రెండో టీ20 ఓడిపోవడానికి కారణం ఇదే..

- నిజం నిర్భయంగా చెప్పిన ఇషాన్ కిషన్..
- నో-బాల్స్, ఫ్రీ-హిట్‌లే మా ఓటమిని శాసించాయి!



**లండన్:** ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి పాలైన తర్వాత, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టు ప్రదర్శనపై అత్యంత నిజాయితీగా స్పందించారు. మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. పవర్‌ప్లేలో భారత్ 65/2 స్కోరుతో బలంగానే కనిపించినప్పటికీ, ఆ తర్వాత మిడిల్ ఓవర్లలో పరుగులు రాబట్టడంలో తడబడిందని అం' కరించారు. ముఖ్యంగా 7 నుండి 10 ఓవర్ల మధ్య కేవలం 32 పరుగులు మాత్రమే వచ్చాయని, అలాగే డెత్ ఓవర్లకు ముందు 14-17 ఓవర్ల వ్యవధిలో కేవలం 23 పరుగులే సాధించగలిగామని కిషన్ వివరించారు. ఈ కీలక సమయాల్లో ఇంకొన్ని పరుగులు రాబట్టాల్సి ఉన్నప్పటికీ, పిచ్ పరిస్థితుల కారణంగా అది సాధ్యపడలేదని ఆయన పేర్కొన్నారు. భారత్ నిర్దేశించిన 191 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ జట్టు మరో ఓవర్ మిగిలి ఉండగానే అలవోకగా ఛేదించింది. అయితే, ఇన్నింగ్స్ 17వ ఓవర్ మ్యాచ్‌ను పూర్తిగా మలుపు తిప్పిందని ఇషాన్ కిషన్ స్పష్టం చేశారు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ వేసిన ఆ ఓవర్లో రెండు నో-బాల్స్ పడటం, వాటి వల్ల వచ్చిన ఫ్రీ-హిట్‌లు ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెథెల్ (76 నాటౌట్) పై ఉన్న ఒత్తిడిని పూర్తిగా తగ్గించాయని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ టీ20ల్లో ఎలాంటి శ్రమ లేకుండా ప్రత్యర్థికి అదనంగా 12 పరుగులు సమర్పించుకోవడం భారీ నష్టాన్ని కలిగిస్తుందని, ఆ ఒక్క ఓవర్ మాత్రమే తమ ఓటమిని పూర్తిగా శాసించిందని కిషన్ విశ్లేషించారు.

### నంబర్ వన్ ర్యాంకింగ్‌పై స్పందన..

ఇటీవలే ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకోవడంపై ఇషాన్ కిషన్ సంతోషం వ్యక్తం చేశారు. కేవలం ఫలితాల గురించి మాత్రమే ఆలోచించకుండా, ప్రతిరోజూ తన బ్యాటింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టడం వల్లనే ఈ మైలురాయిని అందుకోగలిగానని అన్నారు. వరుస ఓటములు జట్టుపై మానసికంగా కొంత ప్రభావం చూపుతాయనేది నిజమేనని, అయితే జట్టులోని ఆటగాళ్లంతా అంతర్జాతీయ స్థాయిలో ఎంతో పరిణతి చెందిన వారు కాబట్టి, తదుపరి మ్యాచ్‌ల్లో అందరం కలిసికట్టుగా పుంజుకుంటామని పూర్తి ధీమా వ్యక్తం చేశారు.

### వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు..

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొడుతూ, కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులోనే భారత్ తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని ఇషాన్ కిషన్ ప్రత్యేకంగా అభినందించారు. వైభవ్ అసాధారణమైన ప్రతిభావంతుడని కొనియాడారు. జట్టులోని సీనియర్ ఆటగాళ్లుగా అతనికి పూర్తి అండగా ఉంటూ, ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించి, అతని సహజసిద్ధమైన ప్రత్యేక ఆటతీరును కాపాడటం తమ అందరి బాధ్యత అని ఇషాన్ కిషన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మెస్సీని వదలని ఎంబాపే

## ఆసక్తిరేపుతున్న గోల్డెన్ బూట్ రేసు..!



అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో 'గోల్డెన్ బూట్' రేసు ఆసక్తి రేపుతోంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సీ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కిలియన్ ఎంబాపే 'నేను ఉన్నానంటూ' దూసుకొచ్చాడు. శనివారం వరకూ మెస్సీ ఏడు గోల్స్‌తో టాప్‌లో ఉండగా ఎంబాపే సైతం అతడి సరసన చేరాడు. గోల్డెన్ బూట్ కోసం ఈసారి కూడా గట్టిపోటీ నెలకొంది. 16వ రౌండ్‌లో పరాగ్వేపై పెనాల్టీని గోల్‌గా మలిచిన ఎంబాపే, మెస్సీతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. నాకౌట్‌లో అర్జెంటీనా, ఫ్రాన్స్ మరిన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశమున్నందున గోల్డెన్ బూట్ కోసం మెస్సీ, ఎంబాపేల మధ్యే పోటీ ఉండనుంది. సాకర్ వరల్డ్‌కప్‌లో అత్యధిక గోల్స్ వీరుడిని గోల్డెన్ బూట్‌తో సత్కరించడం ఆనవాయితీ. ఈసారి ఈ బూట్ కోసం దిగ్గజం లియోనల్ మెస్సీకి, కిలియన్ ఎంబాపే నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. గత ఎడిషన్‌లో(2022) గోల్డెన్ బూట్‌ను తన్నుకుపోయిన ఎంబాపే ఈ దఫా రేసులోనే ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో(పోర్చుగల్) వెనకబడగా.. ఏడు గోల్స్‌తో మెస్సీతో సరిసమానంగా నిలిచాడీ ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాడు. తొలి మ్యాచ్‌లోనే అల్జీరియాపై హ్యాట్రిక్ గోల్స్ చేసిన అర్జెంటీనా కెప్టెన్.. మొత్తంగా నాలుగు మ్యాచుల్లో ఏడు గోల్స్ సాధించాడు. లెజెండరీ ఆటగాడిగా ఎదుగుతున్న ఎంబాపే సైతం 5 మ్యాచుల్లో ఏడు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు. హ్యారీ కేన్(ఇంగ్లండ్), ఎర్లింగ్ హోలాండ్(నార్వే)లు.. ఐదేసి గోల్స్‌తో సంయుక్తంగా మూడో స్థానంలో కొనసాగుతున్నారు.



# స్వియాటెక్, రిబకినాకు చెక్

**లండన్ :** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఒకే రోజు రెండు సంచలనాలు. డిఫెండింగ్ చాంప్, టైటిల్ ఫేవరెట్ ఇగా స్వియాటెక్, రెండో సీడ్ ఎలెనా రిబకినా మూడో రౌండ్‌లోనే ఓడి ఇంటిదారి పట్టారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఫిలిప్పీన్స్‌కు చెందిన 21 ఏండ్ల యంగ్ సెన్సేషన్ అలెగ్జాండ్రా ఈలా 7-6(9/7), 6-2 తో స్వియాటెక్‌ను ఓడించింది. దాంతో ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రి క్వార్టర్స్ చేరిన ఫిలిప్పీన్స్ ప్లేయర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పింది. మరో మ్యాచ్‌లో రిబకినా (కజకిస్థాన్) 6-7 (4/7), 1-6తో 25వ సీడ్ ఎలీస్ మర్టెన్స్ (బెల్జియం) చేతిలో ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో మాడిసన్ కీస్ 3-6, 6-2, 6-3తో అనిసిమోవాను, 13వ సీడ్ పావోలిని (ఇటలీ) 6-1, 6-2తో మరియా సకారి (్ర స్)ను ఓడించారు. కాగా గాయం కారణంగా అమెరికా లెజెండ్ సెరెనా విలియమ్స్ తన అక్క వీనస్‌తో డబుల్స్ ఈవెంట్ నుంచి వైదొలిగింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 7-6 (7/4), 6-4తో గిరోన్ (అమెరికా)ను ఓడించి ప్రిక్వార్టర్స్ చేరాడు. ఐదో సీడ్ డి మినార్, లెహెకా, కొబోలి కూడా ముందంజ వేశారు.

# మళ్లీ బాబర్‌కే పగ్గాలు..!

### కెప్టెన్ మార్పుతో పాక్‌లో గందరగోళం

### షాన్ మసూద్‌పై వేటు వేసిన పీసీబీ

### వెస్టిండీస్ పర్యటనతో బాబర్‌కు తొలి పరీక్ష

**లాహోర్:** పాకిస్థాన్ టెస్టు జట్టు కెప్టెన్సీలో మరోసారి కీలక మార్పు చోటుచేసుకుంది. వరుస వైఫల్యాల నేపథ్యంలో కెప్టెన్ షాన్ మసూద్‌ను తప్పించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌ను మళ్లీ టెస్టు జట్టు సారథిగా నియమించింది. తరచూ కెప్టెన్సీ మార్పులు చేస్తుండటం పాకిస్థాన్ జట్టులో నాయకత్వ సంక్షోభానికి నిదర్శనంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూడేళ్లుగా టెస్టు జట్టుకు నాయకత్వం వహించిన షాన్ మసూద్ తన హయాంలో జట్టును విజయాల బాట పట్టించలేకపోయాడు. అతని కెప్టెన్సీలో పాకిస్థాన్ ఆడిన 16 టెస్టుల్లో 12 మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఈ పేలవ ప్రదర్శన నేపథ్యంలో పీసీబీ మరోసారి బాబర్ ఆజమ్ వైపు మొగ్గు చూపింది. కెప్టెన్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన బాబర్ ఆజమ్‌కు తొలి సవాలు వెస్టిండీస్ పర్యటన కానుంది. ఈ పర్యటనలో పాకిస్థాన్ రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. తొలి టెస్టు జూలై 25 నుంచి తారౌబాలో, రెండో టెస్టు ఆగస్టు 2 నుంచి పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జరగనుంది. ఈ సిరీస్‌తో పాకిస్థాన్ జట్టు తిరిగి విజయాల బాట పట్టాలని బోర్డు ఆశిస్తోంది. కెప్టెన్సీ మార్పుపై పాకిస్థాన్ హై పర్‌ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావేద్ మాట్లాడుతూ.. జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గెలవాల్సిన మ్యాచ్‌లను కూడా చేజార్చుకోవడం, కీలక దశల్లో నాయకత్వ లోపాలు స్పష్టంగా కనిపించాయని పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌తో జరిగిన టెస్టుల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయామని, మ్యాచ్‌ను విజయవంతంగా ముగించడం కెప్టెన్ బాధ్యతేనని ఆయన వ్యాఖ్యానించారు.

### వెస్టిండీస్ పర్యటనకు పాకిస్థాన్ టెస్టు జట్టు

బాబర్ ఆజమ్ (కెప్టెన్), అమీర్ జమాల్, అబ్దుల్లా ఫజల్, అలీ ఉస్మాన్, అజాన్ అవైస్, ఇమామ్ ఉల్ హక్, ఖుర్రమ్ షాజాద్, మహ్మద్ అబ్బాస్, మహ్మద్ అలీ, మహ్మద్ రిజ్వాన్, మహ్మద్ అవైస్ జఫర్, ముహమ్మద్ ఘాజీ ఘోరీ, సాజిద్ ఖాన్, సల్మాన్ అలీ ఆఘా, షాన్ మసూద్, ఉబైద్ షా.



# ప్రశ్న రావణ్ అరెస్టులపై రచ్చ

## ప్రకాష్ రాజ్ విమర్శలు.. బండ్ల గణేష్ ఘాటు కౌంటర్



యూట్యూబర్ 'ప్రశ్న రావణ్' అలియాస్ జోసెఫ్ బచలకురి అరెస్టుల వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఆయనపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే మరో కేసులో పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు రాజకీయ, న్యాయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు, వాటికి నిర్మాత బండ్ల గణేష్ ఇచ్చిన ఘాటు స్పందన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. ప్రశ్న రావణ్‌పై నమోదైన కేసుల్లో ఆయనకు వరుసగా బెయిళ్లు లభిస్తున్నప్పటికీ, విడుదలైన వెంటనే మరో కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని సమాచారం. ఇటీవల ఎలమంచిలి కోర్టు బెయిల్ మంజూరు చేసిన కొద్ది సేపటికే, ఏలూరు పోలీసులు మరో కేసులో నక్కపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆయనను అరెస్ట్ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ విధంగా వరుస అరెస్టులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ప్రశ్న రావణ్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ అంశంపై నటుడు ప్రకాష్ రాజ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. ఒక కేసులో కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసులో అరెస్ట్ చేయడం న్యాయవ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. వరుసగా బెయిళ్లు లభిస్తున్నాయంటే కేసుల బలంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించిన ఆయన, ఈ విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలకు నిర్మాత, నటుడు బండ్ల గణేష్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఆయన చేసిన పోస్టులో ప్రకాష్ రాజ్‌పై వ్యక్తిగత స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రతి అంశంపై అతిగా స్పందించడం సరికాదని పేర్కొంటూ, "ప్రపంచాన్ని మొత్తం నువ్వే నడిపిస్తున్నట్లు వ్యవహరించకు. ముందు నీ బాధ్యతలు, నీ వ్యక్తిత్వాన్ని ఒకసారి నువ్వే పరిశీలించుకో. అతి ప్రవర్తనతో గౌరవం పెరగదు. అణకువగా ఉండటం కూడా అవసరం" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. బండ్ల గణేష్ చేసిన ఈ పోస్టు కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది.



### అలా ఎందుకు చేస్తున్నారని అడిగితే

# తట్టుకోలేరు..

## బాలీవుడ్ బండారం బయటపెట్టిన కృతి సనన్!



బాలీవుడ్ ఇండస్ట్రీ గ్లామర్ వెనుక దాగున్న జెండర్ వివక్ష, డబుల్ స్టాండర్డ్స్‌పై నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీ, స్టార్ హీరోయిన్ కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో ఇప్పటికీ హీరోయిన్లను చాలా తేలికగా తీసుకుంటారని, సెట్స్‌లో వారిని తక్కువ చేసి చూసే ధోరణి ఇంకా కొనసాగుతోందని ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక ఇంటర్వ్యూలో కృతి మాట్లాడుతూ.. తాను కెరీర్‌లో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, షూటింగ్ స్పాట్‌లో ఎదుర్కొన్న వివక్షను ధైర్యంగా బయటపెట్టారు. సెట్స్‌లో ఉండే అసిస్టెంట్ డైరెక్టర్ల ప్రవర్తనను కృతి తప్పుబట్టారు. "అసిస్టెంట్ డైరెక్టర్లకు హీరోల టైమింగ్స్ అంటే కాస్త భయం ఉంటుంది. అందుకే హీరోలు ఇంకా రెడీ కాకపోయినా పర్లేదు కానీ, హీరోయిన్లను మాత్రం ముందే పిలిచి సెట్స్‌లో కూర్చోబెడతారు. ఫీమేల్ యాక్టర్స్ టైమింగ్‌ను వాళ్లు చాలా లైట్‌గా తీసుకుంటారు" అంటూ కృతి సనన్ కుండబద్దలు కొట్టారు. అలాగే సినిమాలోని సీన్స్ లేదా క్యారెక్టర్ గురించి హీరోయిన్లు ఏవైనా డౌట్స్ అడిగితే సెట్స్‌లో చూసే కోణమే వేరుగా ఉంటుందని కృతి సనన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక ఫీమేల్ యాక్టర్ ప్రశ్నలు అడిగితే.. 'అబ్బా.. ఈమె మళ్లీ ప్రశ్నలు మొదలుపెట్టింది, ఎన్ని అడుగుతుంది' అన్నట్లుగా గుసగుసలు వినపడతాయి. ఇది నా విషయంలో కూడా జరిగింది. నేను ఏవైనా డౌట్స్ అడిగితే.. 'మరీ అంతగా ఓవర్ అనలైజ్ చేయకు' అని అనేవాళ్లు. అదే ప్రశ్నను పక్కనున్న మేల్ స్టార్ (హీరో) అడిగితే మాత్రం.. 'వావ్.. అతను సినిమాలో చాలా ఇన్వాల్వ్ అవుతున్నాడు.. ఓకే అతను చెప్పింది చేద్దాం' అంటూ ప్రశంసిస్తారు. నేను చెప్పిన పాయింట్‌నే హీరో చెప్తే వెంటనే ఒప్పుకుంటారు" అని కృతి పేర్కొన్నారు. షూటింగ్ లొకేషన్లలో హీరో, హీరోయిన్లకు ఇచ్చే వసతుల్లోనూ స్పష్టమైన తేడాలు ఉంటాయని కృతి సనన్ స్పష్టం చేశారు. ఇక్కడ సమస్య లగ్జరీ వసతుల గురించి కాదని.. ఆత్మగౌరవానిది అని ఆమె చెప్పారు. సినిమా సెట్స్‌పై కృతి సనన్ చేసిన ఈ బోల్డ్ అండ్ షాకింగ్ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# 'రామాయణం'లో నా పాత్ర చిన్నదే..

### కానీ చిరస్థాయిగా గుర్తుంటుంది!

## మండోదరిగా నటించడం అదృష్టమన్న కాజల్ అగర్వాల్

భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో తాను పోషిస్తున్న మండోదరి పాత్ర చిన్నదే అయినప్పటికీ, జీవితాంతం గుర్తుండిపోయే పాత్రగా నిలుస్తుందని నటి కాజల్ అగర్వాల్ అన్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తుండగా, కాజల్ మండోదరి పాత్రను పోషిస్తున్నారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కాజల్ మాట్లాడుతూ.. తొలి భాగం చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో లంక ఘట్టం పరిమితంగా ఉండటంతో తన స్క్రీన్ టైమ్ కూడా తక్కువేనని చెప్పారు. అయినప్పటికీ భారతీయ సంస్కృతి, ఇతిహాసాలకు ప్రతీకగా నిలిచే ఇలాంటి మహత్తర చిత్రంలో భాగమవడం తన కెరీర్‌లో చిరస్మరణీయ ఘట్టమని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన చిత్రబృందానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. రావణుడి పాత్రలో నటిస్తున్న యష్ గురించి కాజల్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన అత్యంత అంకితభావం కలిగిన నటుడని, సెట్స్‌లో పూర్తిగా పాత్రలో లీనమై పనిచేస్తారని చెప్పారు. ఆయన ప్రొఫెషనలిజం, నటన మొత్తం చిత్రబృందానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. తొలి భాగాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం భావిస్తుండగా, రెండో భాగం వచ్చే ఏడాది విడుదల కానుంది. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన గ్లింప్స్, పోస్టర్లకు విశేష స్పందన లభించింది. ఇక ఈ చిత్ర ట్రైలర్‌ను అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జూలై 14న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేసే అవకాశముందని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అదే వేదికపై అధికారిక విడుదల తేదీని కూడా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. దీంతో 'రామాయణం' ట్రైలర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సింపుల్‌గా ఆమిర్ ఖాన్ - గౌరీ స్ప్రాట్ వివాహం



## సోషల్ మీడియాలో ఫొటోల చక్కర్లు

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్, ఆయన సన్నిహితురాలు గౌరీ స్ప్రాట్ వివాహం చేసుకోబోతున్నారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆమిర్ ఖాన్ నివాసంలో అత్యంత సన్నిహిత కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో వీరిద్దరి వివాహం చేసుకొని ఒక్కటయ్యారు. ప్రత్యేక వివాహ చట్టం (రాజువఎఋశ్రీ మీుతీతీఋుస్త్రవ ాూష్) ప్రకారం ఆమిర్ ఖాన్, గౌరీ స్ప్రాట్ తమ వివాహాన్ని అధికారికంగా నమోదు చేసుకున్నారని తెలుస్తుంది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫొటోల్లో ఆమిర్ ఖాన్ వివాహ పత్రాలపై సంతకం చేస్తున్నట్లు కనిపించగా, ఆయన పక్కనే గౌరీ స్ప్రాట్ సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తున్నారు. ఆమె ధరించిన ఆభరణాలు కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోలని బట్టి చూస్తుంటే వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నట్లు చెబుతున్నారు. గౌరీ స్ప్రాట్ తన మొదటి వివాహం ద్వారా జన్మించిన కుమారుడితో కలిసి వేడుకకు హాజరైనట్లు, అలాగే ఆమిర్ ఖాన్ కుమారుడు ఆజాద్ రావ్ ఖాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వైరల్ అవుతున్నట్టు ఫొటోలని బట్టి తెలుస్తుంది.. ఉంగరాల పెట్టెలతో ఇద్దరు పిల్లలు కనిపించిన దృశ్యాలు రెండు కుటుంబాల కలయికకు ప్రతీకగా సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. అయితే, ఈ వివాహానికి సంబంధించిన వార్తలు, ఫొటోలపై ఇప్పటివరకు ఆమిర్ ఖాన్ లేదా గౌరీ స్ప్రాట్ తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, గత మార్చిలో తన 60వ పుట్టినరోజున గౌరీతో పెళ్లి విషయాన్ని ఆమిర్ ఖాన్ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. జులై 5న ఇంట్లోనే చాలా సింపుల్‌గా పెళ్లి చేసుకుంటున్నాం. ఇరు కుటుంబాలు, కొద్దిమంది స్నేహితులు మాత్రమే హాజరవుతారు అంటూ ఆయన తెలియజేశారు.



ఇక ఇదిలా ఉంటే ఆమిర్ ఖాన్ 1986లో రీనా దత్తాను వివాహం చేసుకుని, 2002లో విడిపోయారు. ఆ తర్వాత 2005లో కిరణ్ రావును పెళ్లి చేసుకుని, 2021లో విడాకులు తీసుకున్నారు. ఇక ఇప్పుడు గౌరీతో వైవాహిక జీవితం కొనసాగించనున్నారు.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com